క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

యద్దనపూడి: మండలంలోని గన్నవరం - మార్టూరు దండు దారి వద్ద వేంచేసి ఉన్న గోవిందమాంబ సమేత శ్రీమద్వీరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళగిరి కమాలాచారి కుమారుడు వీరాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం నాడు స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

ఋణాలతో జీవనోపాధుల పెంపు



మాట్లాడుతున్న డీపీఎం

అద్దంకి: తీసుకున్న ఋణాలతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఎదిగేలా సిబ్బంది పనిచేయాలని జీవనోపాధుల డీపీఎం రవీంద్ర అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జీవనోపాధులు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ పీఎంజీఓ వంటి ఋణాలతో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమానికి ట్రైనర్‌గా డీఆర్‌పీ ప్రమీల, సురేష్ వ్యవహరించగా.. సంధాన కర్తగా ఏంపీఎం ఏపీఎం ఎల్‌హెచ్ వ్యవహరించారు. ఐదు మండలాల వీఓఏలు, ఏపీఎంలు, సీసీలు, ఎల్‌సీలు, ఎంఎస్‌ఏలు, వీవోఏలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విజయ ఏకాదశి పూజలు



కారంచేడు శివాలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కారంచేడు: గ్రామంలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన శ్రీగంగా భవానీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విజయ ఏకాదశి పర్వదిన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయ అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ ఆధ్వర్యంలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యే పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుపాలు, పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివనామ సంకీర్తలతో ఏకాహం నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదిక్షణలను నిర్వహించారు.

అప్రమత్తంగా లేకుంటే నష్టం తప్పదు



కారంచేడు వద్ద వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

కారంచేడు: వ్యవసాయ పనుల నిమిత్తం ప్రయాణాలు చేసే కూలీలు అప్రమత్తంగా లేకుంటే నష్టపోవాల్సి వస్తుందని ఎస్ఐ వి. వెంకట్రావు హెచ్చరించారు. సోమవారం వాడరేవు-పిడుగురాళ్ళ ప్రధాన రహదారిలో చీరాల-కారంచేడు, కారంచేడు-పర్చూరు గ్రామాల మధ్య వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పరిమితికి మించి వ్యవసాయ కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోలను ఆయన నిలుపుదల చేశారు. నిబంధనలు పాటించని వాహన యజమానులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

1898 మంది రైతులకు పీఎం కిసాన్ నిధులు విడుదల



టీవీలో పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్న దృశ్యం

వేటపాలెం: మండల పరిధిలో అర్హులైన 1898 మంది రైతులకు 19వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదలయినట్లు మండల వ్యవసాయ అధికారి ఐ. కాశీవిశ్వనాథ్ తెలిపారు. దేశాయిపేట-2 రైతు సేవా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నీటి సంఘం అధ్యక్షుడు సజ్జా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హరహర మహాదేవ



కొత్తపాలెంలోని శ్రీబాలకోటేశ్వరాస్వామి దేవస్థానం



సోపిరాలలోని శ్రీ రామకోటేశ్వర దేవస్థానం

- మహాశివరాత్రి తిరునాళ్లకు సిద్ధమైన శైవక్షేత్రాలు
- రేపు చినగంజాంలోని శివాలయాల్లో వేడుకలు
- పోటాపోటీగా తిరునాళ్ల నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు
- మరో కోటప్ప కొండగా ఖ్యాతి

చినగంజాం: మహాశివరాత్రి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు మండలంలోని రెండు శైవ క్షేత్రాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాఘ కృష్ణ చతుర్దశి నాడు వచ్చే మహ శివ రాత్రి పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. కొత్తపాలెం పంచాయతీలోని శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయం, చినగంజాం పంచాయతీలోని సోపిరాల గ్రామంలో శ్రీ రామకోటేశ్వర స్వామి ఆలయాల్లో జరిగే తిరునాళ్ల కోటప్పకొండ తరువాత అంతటి ఖ్యాతి పొందాయి. కొత్తపాలెం పంచాయతీలో 101 శివలింగాలతో శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం నెలకొని ఉండగా, ఈ దేవాలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో సుమారు కోటి రూపాయలకు పైగా వెచ్చించి నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బాలకోటేశ్వరుడు స్వయంభు లింగం కాగా భక్తులు కోర్కెలను తీర్చే స్వామిగా ఆయనకు ప్రజలలో ప్రగాఢ విశ్వాసం వుంది.

బాల కోటేశ్వర స్వామి దర్శనం పరమ పావనం



బాలకోటేశ్వర స్వామి మూలవిరాట్

ప్రస్తుతం బాలకోటేశ్వర స్వామి ఆలయం నిర్మించిన ప్రాంతం వందల సంవత్సరాల క్రితం వ్యవసాయ భూమి కాగా కోకి వంశానికి చెందిన వ్యవసాయ రైతు నీటిని భూమి నుంచి తోడి పోసుకునే నిమిత్తం పెద్దగుంత తవ్వాడు. అతని గునపానికి ఒక రాయి తగలి, రక్తం చిందడం, రైతు తవ్వుతున్న గుంతలో చిన్న శివలింగం బయల్పడటంతో శివుడు స్వయంగా తమ ప్రాంతంలో వెలిశాడని భావించి పూజలు చేయడం ప్రారంభించారు. చుట్టు పక్కల ఉండే గ్రామాల వారంతా స్వామిని నమ్ముకొని కొలవడం ప్రారంభించారు. శివలింగం చిన్నదిగా ఉండటంతో స్వామికి బాలకోటేశ్వరుడు అని నామకరణం చేసి గుడి నిర్మాణం చేసుకుని, శివరాత్రి పండుగను ఘనంగా నిర్వహించే వారు. కోకి వంశీయులు గుడి నిర్వహణ చేస్తూ తరువాత కాలంలో ఆర్థిక ఇబ్బందులు కారణంగా చేయలేక మద్దుకూరి నారాయణ రావును స్థానికులు గుడిని నిర్మించాలని కోరారు. దీంతో ఆయన కొద్దిపాటి గుడిని నిర్మించి అభివృద్ధి పరచి పూజాది కార్యక్రమాలను ఆయన సొంత ఖర్చులతో కొనసాగించారు. ఆయన తదనంతరం కోకి వంశీయులకు తిరిగి గుడి నిర్వహణ అప్పగించడంతో అప్పటి నుంచి ఆయన పేరుతో నారాయణ ప్రభ నిర్మించి గుడి వద్దకు రెండు రోజుల ముందుగా చేర్చేవారు. అటు తరువాత కోకి వంశీయులకు తిరునాళ్ల భారం కావడంతో 80వ దశకంలో ఉద్యోగస్తులంతా ఎంప్లాయీస్ యూనియన్‌గా ఏర్పడి గుడి బాధ్యతలను నిర్వహిస్తూ ఉత్సవాలను కొనసాగిస్తున్నారు.

రామకోటేశ్వర స్వామి ఆలయ చరిత్ర

సోపిరాల ప్రజలంతా శ్రీ రామకోటేశ్వర స్వామి ఆలయం నిర్మించుకున్నారు. గతంలో ఈ గ్రామంలోని ప్రజలు కూడా ప్రభలు నిర్మించుకొని ఊరేగింపుగా బాల కోటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్ళి పూజ కార్యక్రమాలు నిర్వహించేవారు. అటు తరువాత కాలంలో గ్రామస్తులు ఆర్థికంగా స్థిరపడుతున్న క్రమంలో రామకోటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. గుడి నిర్మాణం కోసం అప్పటి గ్రామ పెద్ద తుమ్మలపెంట వెంకట స్వామి నేతృత్వంలో సోపిరాల గ్రామ ప్రజలంతా చందాలు సేకరించి గుడి నిర్మాణం పూర్తి చేశారు. గుడి నిర్మాణానికి గ్రామంలోని ప్రతి ఒక్కరూ కృషి చేసి సాయమందించిన వారే. సుమారు 17 ఎకరాల స్థలంలో గుడి నిర్మాణం చేసి కాశి నుంచి శివ లింగాన్ని తెప్పించి ప్రతిష్ట నిర్వహించారు. గుడి నిర్మాణం జరిగిన దగ్గరు నుంచి సోపిరాల ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడంతో, ఆలయాన్ని అభివృద్ధి పరచి ఆలయంలో విఘ్నేశ్వర, లలితాంబ, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలతో పాటు శని విగ్రహాలను ఏర్పాటు చేశారు. గుడి గాలి గోపురాన్ని దివంగత పెద్దరామారావు భారీ వ్యయంతో అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు. వెంకటస్వామి కుమారుడు రామారావు గ్రామం తరపున బాధ్యత తీసుకొని గుడి నిధులతో అభివృద్ధి చేశారు. అనంతరం ప్రస్తుతం ఆ బాధ్యతలను ఆయన సోదరుడు సీతారామాంజనేయులు, గ్రామ ప్రజలంతా ఐక్యంగా నిర్వాహణ బాధ్యతలు చేపట్టారు. గత ఐదు దశాబ్దాలుగా గుడి ప్రాంగణంలో శివరాత్రి పండుగను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. గుడి నిర్మాణం జరిగినప్పటి నుంచి సోపిరాల గ్రామంలోని ప్రజలు ప్రతి ఇంటికి ఒక ప్రభను నిర్మిచుకొని గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించుకుంటూ ఆలయానికి తీసుకెళ్ళే వారు. రెండోరోజు గ్రామంలో మరో సారి భారీగా ఊరేగింపు నిర్వహించేవారు. తిరునాళ్ళను రెండు రోజుల పాటు అత్యంత జరుపుకునేవారు. రానురాను పరిస్థితుల అనుకూలించక గుడి దగ్గరే ప్రభలు నిర్మించే సంస్కృతి వచ్చింది. ఈ ఏడాది గత వైభవానికి తీసి పోకుండా ప్రభలను నిర్మించి తిరునాళ్ల నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు.



శ్రీరామకోటేశ్వరస్వామి మూలవిరాట్

ఘనంగా ప్రింటర్స్ డే



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రింటింగ్ ప్రెస్‌ల నిర్వాహకులు



సీనియర్ ప్రింటర్ తాండవకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: అక్షరాలను తయారు చేసి యంత్రాల ద్వారా కరపత్రాలను ముద్రించే యంత్రాన్ని కొనుగొన్న జోహెన్నెస్ గూటన్ బర్గ్ మహనీయుడు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ముద్రణా యంత్రాలను కనుగొన్న పితామహుడు జోహెన్నెస్ గూటన్ బర్గ్ జయంతి (ప్రింటర్స్ డే) వేడుకలను సోమవారం పట్టణంలోని ప్రింటింగ్, డీటీపీ, బైండర్స్, ఫ్లెక్స్ ప్రింటింగ్ కేంద్రాల నిర్వాహకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆల్ టైమ్ డిజిటల్స్ వద్ద ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్స్ ప్రింటింగ్, డీటీపీ ఆపరేటర్లు, డిజైనర్లు అధికంగా పాల్గొని ప్రింటర్స్‌డే జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జోహెన్నెస్ గూటన్ బర్గ్ చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రచయిత, వ్యాఖ్యాత ఎ.శివకోటేశ్వరరావు హాజరై మాట్లాడారు. అక్షరాలను పేపర్లపై వచ్చేందుకు ఒక యంత్రాన్ని కనిపెట్టిన మహనీయుడు జోహెన్నెస్ గూటన్ బర్గ్ అన్నారు. కంప్యూటర్ యుగం వచ్చిన తర్వాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రింటింగ్ రంగంలో పెనుమార్పులు వచ్చాయని తెలిపారు. అనంతరం ముద్రణారంగంలో సేవలందిస్తున్న సీనియర్ ప్రింటర్ తాండవకృష్ణను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నక్కల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వి.రామమోహనరావు, కోశాధికారి కె.నాగేశ్వర రావు, జాయింట్ సెక్రటరీ పి.సునీత, ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్స్ ప్రింటింగ్ యూనిట్‌ల నిర్వాహకులు, డీటీపీ ఆపరేటర్లు, బైండర్లు పాల్గొన్నారు.

ఉప్పు భూముల లీజు రెన్యువల్ చేయండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న షేక్ జిలానీ, సుబ్బారావు

చినగంజాం: కేంద్ర ప్రభుత్వ ఉప్పు భూముల లీజు రద్దును రెన్యువల్ చేసి పేద రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ జిలాని, పార్టీ నాయకులు కోలా సుబ్బారావు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు విన్నవించారు. మండలంలోని చినగంజాం, రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం, కొత్తపాలెం, మున్నం వారిపాలెం,మూలగాని వారిపాలెం, రామచంద్రనగర్, శాంతి నగర్ గ్రామాలకు చెందిన పేద రైతులు 800 కుటుంబాలు 497 ఎకరాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఉప్పు ఉత్పత్తి భూములు 20 సంవత్సరాల లీజు పద్ధతిలో గత 100 సంవత్సరాల నుంచి సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం లీజు రద్దు వలన చినగంజాంలో నివసించే వేల కుటుంబాలు వలసలు వెళ్ళే పరిస్థితులు కనిపిస్తున్నాయి వివరించారు. చినగంజాం మండలంలో నార్త్ సాల్ట్ ఫ్యాక్టరీ, సౌత సాల్ట్ ఫ్యాక్టరీ ఉన్నాయని వీటి పరిధిలో వందల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. లైసెన్స్ నంబర్ 73లో కేంద్ర ప్రభుత్వ భూమి 297 ఎకరాలు, లైసెన్స్ నంబర్ 86 లో 100 ఎకరాలు, ఈ రెండు లైసెన్స్ భూములు సాల్ట్ వర్కర్స్ కో ఆపరేటివ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ చినగంజాం ఆధ్వర్యంలో పేద రైతులు ఉప్పు ఉత్పత్తి సాగు చేసుకొంటున్నారన్నారు. లైసెన్స్ నంబర్ 74లో కేంద్ర ప్రభుత్వ భూమి 114 ఎకరాలు భూమిలో కో ఆపరేటింగ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ రాజూబంగారు పాలెం పేద రైతులు సాగు కొని జీవనం సాగిస్తున్నారు. వీటి లీజు 2024 డిసెంబరు 1 వ తేదీన లీజు రద్దు అయిన దృష్ట్యా కావున కేంద్ర ప్రభుత్వం మళ్లీ లీజు రెన్యువల్ చేసి వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని వారు కోరారు.

స్థిరపడే వరకు పెళ్లి వద్దు

బల్లికురవ: బాలికలకు ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉందని జీవితంలో స్థిరపడేవరకు వివాహం చేసుకోవద్దని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ రవినాయక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ ప్రిన్సిపాల్ కె. సుధాకర్, కె సరళకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో డీవి సుధ, ఎంవీ ఫౌండేషన్ కోర్డినేటర్ పి. హరిహరరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి చరణ్

చినగంజాం: దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పి. సాయి శ్రీ చరణ్ అన్నారు. మండలంలోని 4 అంగన్‌వాడీ కేంద్రాలు, 3 ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి మొత్తం 220 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. మండల లీగల్ సెల్ సభ్యులు ఏ. రామకృష్ణారెడ్డి, పారాలీగల్ వలంటీర్ ఎంవీ రామారావు, పీహెచ్ఎస్ స్వర్ణలత, హెల్త్ విజిటర్ ఉల్దారాణి, డీఈఓ పి. రాఘవ, సీహెచ్ఓ ప్రశాంతి, ఆశాలు పాల్గొన్నారు.

కారంచేడు ఎస్ఐ సేవా నిరతి

కారంచేడు: రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగి ఉన్న చిల్లచెట్లు, రోడ్డు మలుపుల్లో ప్రమాదాలు జరిగే అవకాశమున్న ప్రదేశాశాల నిర్వహణకు ఎస్ఐ వి. వెంకట్రావు స్పందించారు. చీరాల-కారంచేడు గ్రామాల మధ్య చిల్లచెట్లు దట్టంగా పెరిగి రోడ్డును మూసుకుపోయేలా ఉండటంతో సోమవారం ఆయన ఒక పొక్లెయిన్ తెప్పించి రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చోట్ల వాటిని తొలగించే పనులు చేపట్టారు.

ఒత్తిడిలేని జీవితాన్ని అవలంబించండి

బల్లికురవ: అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతిరోజూ యోగాతోపాటు, ధ్యానం చేయటంవల్ల వత్తిడిలేని జీవితాన్ని అవలంభించవచ్చని ఎంఈవో 2 రమేష్‌బాబు అన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా సోమవారం మెడిటేషన్ పై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ విజయ నిర్మల, రిసోర్స్ పర్సన్ సురేష్, రామకృష్ణ నల్గొన్నారు.

చిన్నారులను పాఠశాలకు సిద్ధం చేయండి



కడవకుదురులో జ్ఞానజ్యోతి శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు



స్వర్ణలో టీఎల్‌ఎంలను పరిశీలిస్తున్న సీడీపీఓ ఝాన్సీ

చినగంజాం: అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులను పాఠశాలకు సంసిద్ధులను చేయాలని ఎంఈఓ బి. అజయ్‌బాబు అన్నారు. సోమవారం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం 5వ రోజు కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాఠశాల సంసిద్ధత మేళా నిర్వహించారు. మొదటి రోజు స్కూల్‌కి వెళ్ళే పిల్లలకు అంగన్‌వాడీ స్కూల్‌లో ఏర్పాటు చేసి గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, పిల్లలను ఆహ్వానించాలని తెలియజేశారు. అంగన్‌వాడీ స్కూల్‌లో నమోదు ప్రక్రియ మేళా రిపోర్టు కార్డు.. అభివృద్ధి గురించి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం కె. రామారావు, డీఆర్‌పీఓ శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, కె. వాణిశ్రీ, ఎన్. సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'టీఎల్‌ఎం'తో ఉత్తమ బోధన

స్వర్ణ (కారంచేడు): అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం ప్రభుత్వ పాఠశాలల్లో మాదిరిగా బోధించాలని సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. సోమవారం స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వర్ణ సెక్టార్ పరిధిలోని గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న ఆశాజ్యోతి శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. శిక్షణలో చిన్నారులకు మెరుగైన విద్యతోపాటు, ఆట పాటలు, పౌష్టికాహారం అందించాలన్నారు. హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, డీఆర్‌పీలు నరసింహారెడ్డి, సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంకలమర్రులో..

మండలంలోని కుంకలమర్రు గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో కారంచేడు సెక్టార్ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన టీఎల్‌ఎంలను నిర్వాహకులు హెచ్‌ఎం పద్మావతి పరిశీలించారు. డీఆర్‌పీలుగా వి. బాబూరావు, సీహెచ్ రేణుక, హిమబిందు పాల్గొన్నారు.

చిన్నారులకు అవగాహన కల్పించాలి

పర్చూరు(చినగంజాం): చిన్నారులకు విద్యాభ్యాసంతోపాటు ఇతర అంశాలపై కూడా అవగాహన కల్పించాలని ప్రధాన శిక్షకుడు బ్రహ్మయ్య అన్నారు. సోమవారం చెరుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా చెరుకూరు సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. రిజిస్ట్రేషన్, జన్మదినాలు, సీమంతాలు, అన్నప్రాసన తదితర అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. బాలకోటేశ్వరరావు, సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కుంకలమర్రులో టీఎల్‌ఎంలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్మికులను రెగ్యులర్ చేయాలంటూ సీఎంకు లేఖలు

చీరాల అర్బన్: మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలంటూ సీఎం చంద్రబాబుకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం లేఖలు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేయాలని తీర్మానించిన నేపథ్యంలో పారుగు సేవల కార్మికుల్లో తీవ్ర భయాందోళన నెలకొందన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందని, ఉద్యోగ భద్రత లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించే విధంగా కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ చీరాల మున్సిపల్ కార్మికులు, ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ముఖ్యంత్రికి సామూహిక లేఖలు రాసి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. చీరాల కమిటీ నాయకులు, బాపట్ల జిల్లా కన్వీనర్ చిమట వీరాస్వామి, చీరాల కమిటీ నాయకులు జి.ఇమ్మానియేల్, డి.శామ్యూల్, క్రాంతిసాగర్, సింగయ్య, షేక్ చాంద్‌బాషా, గొల్లప్రోలు నాగేశ్వరరావు, పి.సురేష్, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి లేఖలు పంపుతున్న దృశ్యం

ఆప్కాస్‌ను కొనసాగించాలి

అద్దంకి రూరల్: మున్సిపాలిటి పరిధిలోని ఆప్కాస్ విధానాన్నే కొనసాగించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అద్దంకి మున్సిపాలిటీ పరధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి పంపనున్న పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉసురుపాటి సామ్యూల్, జి. పెద్దమార్కు, మారుతి, డి. యోహోషువా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటిపన్నులు, ప్రస్తుత పన్నుల వసూళ్లు వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఇంటి పన్నులపై ఎంపీడీవో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 15 గ్రామాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఇంటి పన్నుల వసూళ్లు చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లల్లో అలసత్వం వహించరాదన్నారు. గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉంచాలని చెప్పారు. ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు, తదితరులున్నారు.

గురుకుల విద్యార్థులకు ప్రథమ బహుమతి

పర్చూరు(చినగంజాం): పర్చూరు వైఆర్ జెడ్పీ హైస్కూల్‌లో 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో నాగులపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రథమ బహుమతి లభించినట్లు మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ తెలిపారు. రెండో బహుమతిని ఉప్పుటూరు జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. రిటైర్డ్ నవోదయ ఉపాధ్యాయుడు ప్రముఖ రేడియో ఆర్టిస్ట్ పిన్నక సాంబశివరావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. ఎంఈఓ సత్యనారాయణ బహుమతులను అందించారు. ఎంఈఓ వెంకటరామయ్య, వైఆర్ హైస్కూల్ హెచ్‌ఎం ఈదర రాజశేఖర్ పాల్గొన్నారు.

అర్జీల విచారణ వేగవంతం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కె. గోపీకృష్ణ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ డి.అర్జున్, వీఆర్వోలున్నారు.